## 'మణుగూరు 'లో 80 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 29: సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా ఫిబ్రవరి నెలలో 80శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలిపారు. గురువారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి నెలలో మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 10లక్షల 67వేల 900 టన్నులకు గాను 8లక్షల 57వేల 307 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి 80శాతం నమోదు చేసిందన్నారు. ఫిబ్రవరి నెలలో 8లక్షల 56వేల 23 టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. ఓవర్ బర్డెన్ (ఓబీ) ఫిబ్రవరి నెలలో 14లక్షల 73వేల క్యూబిక్ మీటర్లు వెలికితీసి 105 శాతం సాధించామని, ప్రోగ్రెస్సివ్ ఓబీ వెలికితీతలో 127లక్షల 63వేల క్యూబిక్ మీటర్లు తీసి 82శాతం నమోదు చేశామన్నారు. అనంతరం ఫిబ్రవరి నెలలో పదవీవిరమణ, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులకు నగదు సెటిల్‌మెంట్ల వివరాలు తెలిపారు. సమావేశంలో ఏజీఎం(సివిల్) డీ వెంకటేశ్వర్లు, కేపీయూజీ (పీవో) వీరభద్రరావు, డీజీఎం(ఐఈడీ) వెంకట్‌రావు, డీజీఎం(పర్సనల్) ఎస్ రమేశ్, డీవై సీఎంవో మేరీ కుమారి, డీజీఎం(ఫైనాన్స్) అనురాధ, సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, పర్యావరణ అధికారి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సబ్ జైలును సందర్శించిన సివిల్ జడ్జి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 29: ఇల్లెందు సబ్‌జైలును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి సందర్శించారు. గురువారం సబ్‌జైలులో ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో.. లేదో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ ఎన్.చంద్రశేఖర్, హెడ్ వార్డెన్ భుజరంగరాజు, సిబ్బంది శోభన్, శాంతి స్వరూప్, న్యాయవాదులు ఉమామహేశ్వరరావు, కీర్తి, కార్తీక్ పాల్గొన్నారు.

## రిటైర్ అవుతున్న జీఎంలకు ఆత్మీయ సన్మానం

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 29: పలు విభాగాల్లో పనిచేస్తూ రిటైర్ అవుతున్న జీఎంలను సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులు గురువారం సన్మానించారు. ఎం.సురేశ్, పీఎస్‌కే రవి, నాగేశ్వరరావు, శేషకుమార్‌లు సంస్థలో వివిధ విభాగాల్లో జీఎంలుగా, డైరెక్టర్లుగా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విమరణ పొందగా.. స్థానిక కాన్ఫరెన్స్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారందరినీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. వివిధ శాఖల అధికారులు రమేశ్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దామోదరరావు, రాంకుమార్‌రావు, హన్మంతరావు, కవితానాయుడు, సాయిబాబు, సూర్యనారాయణరాజు, గణపతి, మాచరయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్య ఆదాయం రూ.1.77 కోట్లు

భద్రాచలం, ఫిబ్రవరి 29: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 56 రోజులకుగానూ రూ.1.77 కోట్లు సమకూరింది. ఈ విషయాన్ని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చిన ఆదాయంలో బంగారం 174 గ్రాములు, వెండి ఒక కేజీ 248 గ్రాములు, అమెరికన్ డాలర్లు 1115, సౌతాఫ్రికా రాండ్స్ 1000, కెనడా డాలర్లు 90, ఆస్ట్రేలియన్ డాలర్లు 145, మలేషియా రింగిట్స్ 17, ఇంగ్లాండ్ పౌండ్స్ 25, సౌదీ అరేబియా రియాల్స్ 6, జపాన్ యెన్ 1000, యూఏఈ దినారమ్స్ 15, ఖతార్ రియాల్స్ 6, ఓమెన్ బైసా 100, బంగ్లాదేశ్ టాకా 10, థాయ్‌లాండ్ కరెన్సీ 20 వచ్చాయని, అన్నదాన సత్రంలోని హుండీ ద్వారా రూ. 3.88 లక్షలు వచ్చిందని వివరించారు.

## ఎస్‌బీఐ ఉద్యోగికి రిటైర్మెంట్ సన్మానం

చుంచుపల్లి, ఫిబ్రవరి 29: ఎస్‌బీఐ చుంచుపల్లి విద్యానగర్‌కాలనీ బ్రాంచిలో చీఫ్ అసోసియేట్‌గా విధులు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ పొందిన చిట్టూరి నాగరాజును బ్యాంకు మేనేజర్, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గడిచిన 38 ఏళ్లుగా బ్యాంకులో వివిధ విభాగాల్లో ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ బదావత్ జగన్, ఫీల్డ్ ఆఫీసర్ దేవబత్తుల రాకేశ్, సిబ్బంది సాయిలక్ష్మి, సాయికృష్ణ, బీ.కిషన్ పాల్గొన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న బ్యాంక్ అధికారులు

## విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

టేకులపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని మొక్కంపాడు పంచాయతీలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం పలు విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

## కాంగ్రెస్ వచ్చి.. కరెంట్ కష్టాలు తెచ్చింది

- రెండు నెలలకే బీటలు వారిన భూములు
- కరెంటు కోతలతో ప్రశ్నార్థకమైన సాగు
- పోలారం, కొమరారం రైతుల అవస్థలు



నీళ్లు అందక నెర్రెలిచ్చిన పంట భూమి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.. మళ్లీ పాత కరెంట్ కష్టాలు కొని తెచ్చుకున్నట్లుంది.. ప్రజలు నమ్మి అధికారం ఇచ్చి అందలం ఎక్కిస్తే పరిపాలనలో రోజుకో మార్పును చేస్తూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నది.. మొదట బస్సు ఫ్రీతో ఆటోలు, రిక్షాలు, జీపులు నడుపుకునే వారి జీవనాధారంపై దెబ్బ కొట్టింది.. నేడు కరెంటు కోతలతో అన్నదాతలకు పాత రోజులు గుర్తుకు తెస్తున్నది.

ఇల్లెందు మండలంలోని కొమరారం, పోలారం పంచాయతీలోని రైతులు కరెంటు కోతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 11 గంటలకు నుంచి సుమారు 8 గంటల కరెంటు కోత విధిస్తుండడంతో సాగు ప్రశ్నార్థకమైంది. రెండు పంచాయతీల్లో సుమారు 12 గ్రామాల రైతులు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలకే కరెంటు కష్టాలు మొదలయ్యాయి. సాగుకు సరిపడా కరెంట్ లేక పొలాలు నీరు లేక బీటవారి పోతున్నాయి. విద్యుత్ సరఫరా ఎప్పుడు ఇస్తారో అర్థంకాని రైతులు ఇంటిని వదిలి పొలాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొన్నదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

### ఇదేం పాలన మహాప్రభో..



కాంగ్రెస్ కరెంటు కోత లేకుండా ఇస్తారనుకుంటే ఉన్న కరెంటును తీసి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నేను పుచ్చకాయ, దోస, బుడంకాయ పంటలు వేశాను. కరెంటు సరఫరా సరిగ్గా లేకపోవడంతో పడిగాపులు కాస్తున్నా. బీఆర్ఎస్ హయాంలో ఎన్నడూ కరెంటు కోతలు చూడలేదు.

–మోడెం అంజయ్య, రైతు, కొమరారం పంచాయతీ, ఇల్లెందు

### చాలా అవస్థలు పడుతున్నాం



కరెంటు కోతతో చాలా అవస్థలు పడుతున్నాం. నాకున్న పదెకరాల పొలంలో వరి వేశాను. కరెంటు 8 గంటలు కోత విధిస్తున్నారు. కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితి కనపడిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ పాలనలో ఇన్న అవస్థలు పడతామని అనుకోలేదు.

– మచ్చ కృష్ణ, రైతు, పోలారం పంచాయతీ, ఇల్లెందు

### పంటలు ఎండిపోతున్నాయి



నేను మొక్కజొన్న పండించాను. ప్రస్తుతం కరెంటు లేక నీటికి కటకట అవుతుంది. పంటల సాగుకు సరిగ్గా నీరు అందక అక్కడక్కడ ఎండిపోతున్నాయి. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో చెప్పలేము. కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సరఫరా సరిగ్గా అందించాలని కోరుకుంటున్నా.

– భూక్యా పద్మ, రైతు, కొమరారం పంచాయతీ

## సెకండియర్ పరీక్షలకు 9,106 మంది హాజరు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 36 కేంద్రాలు పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో 7487 మంది, ఒకేషనల్ విభాగంలో 1929 మంది కలిపి మొత్తం 9416 మంది పరీక్షలు రాయాల్సి ఉంది. కానీ జనరల్ విభాగంలో 7308 మంది, ఒకేషనల్ విభాగంలో 1798 మంది కలిపి మొత్తం 9106 మంది పరీక్షలకు హాజరయ్యారు. 310 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. తాగునీటి వసతిని కల్పించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో వందమీటర్ల వరకు 144 సెక్షన్‌ను అమలు చేశారు. నిమిషం నిబంధన అమలు చేయడంతో ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 9 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లను మూసివేశారు. కొత్తగూడెం, పాల్వంచలోని కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ నోడల్ ఆఫీసర్ సులోచనారాణి పరిశీలించారు.

## వీళ్ల బర్త్ డే.. నాలుగేళ్లకు ఒక్కసారే..!



చిన్నారితో వైద్యులు

రామవరం, ఫిబ్రవరి 29 : ఏడాదిలో ఫిబ్రవరి నెలకో ప్రత్యేకత ఉంటుంది. అదే.. నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి నెలలో 29 రోజులు ఉండడం. ప్రస్తుత ఏడాది లీప్ సంవత్సరంలో గురువారం చివరిరోజు. ఈ ప్రత్యేకమైన రోజున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో 9 మంది చిన్నారులు జన్మించినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఇలా లీప్ సంవత్సరంలో జన్మించడం చాలా అరుదు. వందలో ఒకరు ఈరోజు జన్మిస్తుంటారు. సాధారణంగా జన్మించిన అందరూ ఏటా జన్మదిన వేడుకలు చేసుకుంటే.. లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి 29న జన్మించిన వారు మాత్రం నాలుగేళ్లకోసారి తమ పుట్టినరోజు జరుపుకోవడం వారికో పండుగే.

## రేపు దమ్మపేటలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం

దమ్మపేట, ఫిబ్రవరి 29: దమ్మపేటలో ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును శనివారం భద్రాద్రి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, హైకోర్ట్ జడ్జి వేణుగోపాల్ ప్రారంభిస్తారని, కార్యక్రమానికి హైకోర్టు జడ్జీలు భీమపాక నగేష్, కాజా శరత్, భద్రాద్రి జిల్లా జడ్జి వసంత్ పాటిల్ హాజరవుతారని గురువారం బార్ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది.

అశ్వారావుపేట, ఫిబ్రవరి 29: దమ్మపేటకు కోర్టు తీసుకురావడం హర్షణీయమని మండలానికి చెందిన న్యాయవాదులు ఉడతనేని శ్రీనివాసరావు, లక్కినేని నరేంద్ర, మారం సతీశ్‌కుమార్, తుమ్మా రాంబాబు, సుధాకర్, మడుపు నాగ వెంకటరమణ, అరుణ గురువారం తెలిపారు. కోర్టు వచ్చేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నామన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

టేకులపల్లి, ఫిబ్రవరి 29: ముత్యాలంపాడు 11 కేవీ ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బొమ్మనపల్లి ఏఈ కన్నయ్య తెలిపారు. ముత్యాలంపాడు ఫీడర్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 29: పట్టణ ప్రజల ఆస్తి పన్ను బకాయిలపై ప్రభుత్వం 90 శాతం వడ్డీ మాఫీని ప్రకటించిందని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 వరకు ఉన్న ఆస్తి పన్ను బకాయిలను 90 శాతం వడ్డీ మాఫీతో వన్ టైం సెటిల్‌మెంట్ స్కీం (ఓటీఎస్) ద్వారా క్లియర్ చేసుకోవచ్చునని అన్నారు. మార్చి 31 వరకూ ఉన్న ఈ ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇంతకుముందే పన్నులు చెల్లించిన వారికి రానున్న ఆర్థిక సంవత్సరానికి అడ్వాన్స్‌గా ఈ మాఫీని సర్దుబాటు చేయనున్నట్లు చెప్పారు.

## సమస్యల పరిష్కారానికి వినతి

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 29: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించి వారి ఆకాంక్షలను నెరవేరుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి బాధ్యులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మాథ్యూస్.. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. కొత్తగూడెంలో మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇచ్చారు.

## 'విలువలున్న వ్యక్తులు ఎప్పటికీ ఓడిపోరు'

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 29: విలువలున్న వ్యక్తులు ఎప్పటికీ ఓడిపోరని, స్వచ్ఛ రాజకీయాలు ఎన్నటికీ చెరిగిపోవని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ అభివృద్ధికి కంకణం కట్టుకొని పనిచేస్తున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అవిశ్వాసంలో నెగ్గడం ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇటీవలి అవిశ్వాసంలో ఆమె నెగ్గిన సందర్భంగా కొత్తగూడెంలోని ఆమె నివాసానికి గురువారం గుమ్మడి నర్సయ్య వెళ్లి కలిశారు ఆయనను సీతాలక్ష్మి సన్మానించారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన నిరాడంబరుడైన గుమ్మడి నర్సయ్య ఆశీస్సులు ఇవ్వడంపై సంతోషం వ్యక్తం చేశారు.

## 'విద్యార్థి మృతికి ప్రభుత్వానిదే బాధ్యత'

టేకులపల్లి, ఫిబ్రవరి 29: ఆదిలాబాద్ జిల్లాలో ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధనతో పరీక్షకు అనుమతించలేదని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని పీడీఎస్‌యూ నాయకుడు గణేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## సేవలు అభినందనీయం

సారపాక, ఫిబ్రవరి 29: ఐటీసీ అనుబంధంగా నడుస్తున్న రోటరీక్లబ్ ఆఫ్ ఇన్‌భద్ర సేవలు అభినందనీయమని ఐటీసీ యూనిట్ హెడ్ ప్రణవ్‌శర్మ అన్నారు. గురువారం సారపాకలోని గాంధీనగర్ శ్రీసత్యసాయి పాఠశాల విద్యార్థులకు క్లబ్ నిర్వాహకులు యూనిఫామ్, వాటర్‌గ్లాసులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ శ్యామ్‌కిరణ్, రోటరీక్లబ్ ఆఫ్ ఇన్‌భద్ర అధ్యక్ష, కార్యదర్శులు జయంతి కుమార్ దాస్, కేవీఎస్ గోవిందరావు, ఐటీసీ అడ్మిన్ మేనేజర్ చెంగల్‌రావు, శివరాం కృష్ణన్, ప్రఫుల్ల, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ములకలపల్లి, ఫిబ్రవరి 29: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మాదారం శివారులో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణానికి చెందిన ముత్యాల సుమన్, చర్ల వేణుగోపాల్ (36) గురువారం బైక్‌పై వెళ్తూ ప్రమాదవశాత్తు మాదారం శివారులో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. ఘటనలో వేణుగోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుమన్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న ఒకరిద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

## పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

చంద్రుగొండ, ఫిబ్రవరి 29: సమష్టిగా పనిచేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని జడ్పీటీసీ కొనకండ్ల వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం 3వ తేదీ పల్స్‌పోలియోపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ వ్యాక్సిన్ ఇచ్చి పోలియో మహమ్మారిని తరిమివేద్దామన్నారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో అశోక్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319443-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## సామర్థ్యాల అంచనా

అశ్వారావుపేట టౌన్, ఫిబ్రవరి 29: పట్టణ పరిధిలోని గంగారం ప్రాథమిక పాఠశాలను గురువారం తొలిమెట్టు నోడల్ అధికారి పి.ప్రసాదరావు, హెచ్ఎం పి.హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు.

## వేతనాలు ఇవ్వాలని సమ్మె

టేకులపల్లి, ఫిబ్రవరి 29: పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ట్రైబల్ వెల్ఫేర్ పీఎంహెచ్ హాస్టళ్ల ఔట్ సోర్సింగ్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం సమ్మెను ప్రారంభించారు. మండలం కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెను ప్రారంభించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## ఇల్లెందు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఇల్లెందు, ఫిబ్రవరి 29: ఇల్లెందు మున్సిపాలిటీలో గురువారం సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 8 అంశాలను కౌన్సిల్ సమావేశం ఆమోదించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ జానీపాష, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 29: పట్టభద్రులు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కె.రవికుమార్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించామని, అభ్యంతరాలు, ఓటు నమోదు కోసం మార్చి 14 వరకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సాగర్, రమేశ్, నభి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, శ్యామ్ తివారి, గోపికృష్ణ, యాకూబ్ షావలి పాల్గొన్నారు.

## విద్యార్థులకు సాయం

అశ్వాపురం, ఫిబ్రవరి 29: మండలంలోని అమ్మగారిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎల్‌అండ్‌టీ కంపెనీ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా గురువారం బ్యాగులు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, బ్లాక్ బోర్డులు, కుర్చీలు, టేబుళ్లు, ఫ్రిడ్జ్ అందజేశారు. ఎంఈవో చారి, ఎల్అండ్‌టీ మేనేజర్ రజనీష్ చౌహాన్, ఎంఈవో వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపు

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 29: కొత్తగూడెం మున్సిపాలిటీ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వమించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు ఇళ్లకు ఒకే ఇంటి నంబర్లు ఉన్న వాటిని గుర్తించి వాటిలో ఒక ఇంటి నంబరును తొలగించేందుకు పరిపాలనా ఆమోదం తెలిపారన్నారు. కిన్నెరసాని నీటి సరఫరా రేగళ్ల కాల్వతండాలో సీసీ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టేందుకు రూ.5 లక్షల నిధులను ఆమోదించారని అన్నారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు కేటాయించి పరిపాలనా అనుమతులు వచ్చాయన్నారు. వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, కమిషనర్ శేషాంజన్ స్వామి, అధికారులు రవికుమార్, ఎల్‌వీ సత్యనారాయణ, సాహితి, డీ.రాము, చంద్రయ్య, ఎం.అశోక్, వీరభద్రాచారి పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనతోనే మెరుగైన జీవితం



మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 29: పేదరిక నిర్మూలన ద్వారానే మెరుగైన సమాజ స్థాపన సాధ్యమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి పేర్కొన్నారు. పాత కొత్తగూడెంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిరక్షరాస్యత, నిరుద్యోగం వంటివి పేదరికానికి ప్రధానమైన కారణాలని అన్నారు. ఆర్థిక అసమానతలు తగ్గించడం, దారిద్య్రరేఖకు దిగువన ఉన వారికి సంక్షేమ పథకాలు అందించడం వంటి చర్యలు చేపట్టడం ద్వారా పేదరికాన్ని తగ్గించవచ్చని అన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల గురించి విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ జ్యోతి విశ్వకర్మ, నాగస్రవంతి, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు, ప్రిన్సిపాల్ రాజేశ్వరి పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే ఆర్థికాంశాలు తెలియాలి



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 29: విద్యార్థి దశ నుంచే ఆర్థిక అంశాల గురించి తెలిసి ఉండాలని డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) రామిరెడ్డి అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా లక్ష్మీదేవిపల్లి శ్రీరామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రిన్సిపాల్ హవీలా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులందరూ ఆర్థిక అంశాలపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రాంబాబు మాట్లాడుతూ.. తమ బ్యాంకు ద్వారా పలు బీమా పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. యూబీఐ చీఫ్ మేనేజర్ కిషన్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా జరిగే ఆర్థిక మోసాలపై ఖాతాదారులు జాగ్రత్తగా ఉండాలని, తమను తాము పరీక్షించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి, ఐసీఐసీఐ మేనేజర్ పవన్‌కుమార్ నె ప్రూ, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మాధవి, రమేశ్, సు ష్మిత, కృష్ణవేణి, మధు, సునీత, శ్రీలత, అంజని పాల్గొన్నారు.

## సింగరేణి పాఠశాల గర్వకారణం



అభినందిస్తున్న జీఎం జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 29: సింగరేణి ఉన్నత పాఠశాల ఇల్లెందు ఏరియాకే గర్వకారణమని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. గురువారం సింగరేణివ్యాప్తంగా గోదావరి ఖనిలో నిర్వహించిన సింగరేణి పాఠశాల స్పోర్ట్స్ మీట్ 2023–24 ఆటల పోటీల్లో సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ సాధించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. 4 సంవత్సరాలుగా సింగరేణి పాఠశాల విద్యార్థులు 9 పాఠశాలలపై పోటీ పడి ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. గిరిధర్‌రావు, జీవీ మోహన్‌రావు, ధనుంజయ్‌రెడ్డి, అంజిరెడ్డి, సాయి స్వరూప్, తిప్పర్తి వెంకటేశ్వర్లు, బొద్దుల శ్రీనివాస్‌రావు, సుధాకర్, మేరీ, వీరభద్రయ్య, శ్రీనివాస్‌రావు, పండు, ఉదయ్‌శ్రీ, నితిన్, వికాస్, సాయిరాం, హిందు, జశ్విత, వైష్ణవి పాల్గొన్నారు.

### నైపుణ్యతను పెంచుకోవాలి

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 29: సింగరేణి ఉద్యోగులు విధుల్లో నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. గురువారం జీఎం కార్యాలయంలో అర్హత కలిగిన కేడర్ స్కీమ్, టైంబౌండ్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆరుగురు ఉద్యోగులకు ఉత్తర్వులు అందజేశారు. అనంతరం ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏజీఎం గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, సేఫ్టీ అధికారి ధనుంజయ్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి, పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగుల సంక్షేమంలో సింగరేణిది కీలక పాత్ర

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 29: సింగరేణి ఉద్యోగుల సంక్షేమంలో సంస్థ కీలకపాత్ర పోషిస్తుందని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. గురువారం జేకే కాలనీ సీఈఆర్ క్లబ్‌లో 2023–24 వార్షిక సంవత్సరానికి సంబంధించి వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం 24 ఏరియాలోని రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో క్రీడాకారులకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శివప్రసాద్, జీవీ మోహన్‌రావు, సాయి స్వరూప్, నజీర్ అహ్మద్, వెంకటేశ్వర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన అదనపు కమాండెంట్

లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని చాతకొండ 6వ బెటాలియన్ అదనపు కమాండెంట్ అంజయ్య, ఆర్ఐ జీవీ రామారావు, జీ.శ్యాంప్రసాద్, ఆర్ఎస్సై గోపీలు గురువారం కొత్తగూడెంలో కలెక్టర్ ప్రియాంకను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌కు కావాల్సిన రోడ్డు, పెట్రోల్ బంకు స్థలం, ఆసుపత్రిలో వైద్యుడి నియామకం వంటి అంశాల గురించి విన్నవించారు. వాటి పట్ల కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

## అధిక ఉత్పత్తికి కృషి చేయాలి

పాల్వంచ, ఫిబ్రవరి 29: రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సమష్టిగా పనిచేసి అధిక ఉత్పత్తికి కృషి చేయాలని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ప్రభాకర్‌రావు సూచించారు. పాల్వంచ కేటీపీఎస్‌లోని తన చాంబర్‌లో గురువారం జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1535 యూనియన్ నాయకులు ఎంఏ వజీర్, రాధాకృష్ణ, ఎం.శ్రీధర్, అల్లాడి పుల్లారావు, మాలోత్ నాగేశ్వరరావు, కుక్కల సాంబయ్య, నర్సింహారెడ్డి, యల్లయ్య పాల్గొన్నారు.

## ఉదయం ఏడింటికే పనుల్లో ఉండాలి

పాల్వంచ, ఫిబ్రవరి 29: ఉపాధి హామీ కూలీలు ప్రతి రోజూ ఉదయం 7 గంటలకే పనుల్లో ఉండాలని ఎంపీడీవో భాస్కర్‌రెడ్డి సూచించారు. ప్రతి రోజూ ప్రతి ఒక్కరికీ రూ.272 చొప్పున రోజువారీ వేతనం అందేలా కూలీలు పనులు చేయాలని సూచించారు. పాల్వంచ మండలంలోని గురువారం పర్యటించిన ఆయన.. లక్ష్మీదేవిపల్లి, బసవతారకం కాలనీ, కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. బసవతారక కాలనీలోని ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కల్లోంచి ప్రతి కుటుంబానికి ఆరు మొక్కలను అందిచాలని సూచించారు. ఏపీవో పోరండ్ల రంగా, కార్యదర్శులు కృష్ణవేణి, రాంబాబు, సాయిరాం, క్షేత్ర సాంకేతిక సహాయకులు రజిత, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఫంక్షన్ హాల్‌కు భూమి పూజ

బూర్గంపహాడ్, ఫిబ్రవరి 20: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని ముత్యాలమ్మ ఆలయం ఆవరణలో ఎంపీ నిధులు రూ.కోటితో నూతనంగా నిర్మించనున్న ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులకు జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, రాజ్యసభ సభ్యుగు వద్దిరాజు రవిచంద్రల సహకారంతో ఎంపీ నిధులు కింద మండలంలో పలు పంచాయతీల్లో రూ.2.29 కోట్లతో ఫంక్షన్‌హాల్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు మంజూరయ్యాయన్నారు.

## 'సొమ్ము గోల్‌మాల్ చేసింది ఎవరైనా వారిపై చర్యలు తప్పవు'

భద్రాచలం, ఫిబ్రవరి 29: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ పరిధిలోని జానకీ సదనంలో ఓ గది నిర్మాణానికి దాతలు ఇచ్చిన రూ.11 లక్షల సొమ్ము గోల్‌మాల్ అయిందనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చాయని, బాధ్యులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. ఆలయంలోని ఆమె చాంబర్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇదే విషయమై ఒక ట్రస్ట్ సభ్యులు తనను సంప్రదించారని, తాము వెంటనే స్పందించి ఆధారాలు ఉంటే చూపించాలని సూచించామన్నారు. తర్వాత వారి నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అలాగే సొమ్ము గోల్‌మాల్ అయినట్లు ఎవరూ తమకు ఫిర్యాదు చేయలేదన్నారు. సొమ్ము విషయమై దాతలు, ఓ ట్రస్ట్ సభ్యులు, ఆలయ ఉద్యోగులు చర్చించుకున్నట్లు తమకు తెలిసిందన్నారు. ఈ విషయంపై ఇప్పటికైనా ఎవరైనా ఫిర్యాదు చేస్తే తాము స్పందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.